చిరు వ్యాపారుల కోసం వెండింగ్ జోన్లు


మాట్లాడుతున్న కమిషనర్ పి.విశ్వనాథ్

కర్నూలు (టౌన్): నగర ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నగరపాలక పరిధిలో చిరు వ్యాపారుల కోసం వెండింగ్ జోన్లు ఏర్పాటు చేస్తున్నట్లు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ స్పష్టం చేశారు. బుధవారం సాయంత్రం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలోని తన చాంబర్‌లో టౌన్ వెండింగ్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. నగరంలోని 127 ప్రాంతాలను రెడ్, గ్రీన్, అంబర్ జోన్లుగా విభజించామన్నారు. కొన్ని ప్రాంతాల్లో వీధి వ్యాపారాల నిషేధంతో పాటు మరికొన్ని ప్రాంతాల్లో పండుగల వంటి ప్రత్యేక సందర్భాల్లో అనుమతించేలా జోన్లు ఏర్పాటు చేశామన్నారు. స్మార్ట్ సిటీలో భాగంగా స్థానిక అశోక్ నగర్‌లో 40 , బిర్లా కాంపౌండ్‌లో 10 షాపులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. తొలగించిన చిరు వ్యాపారులకు వాటిలో అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. పీఎం స్వానిధి పథకం కింద తొలి విడత రూ.15 వేలు, రెండవ విడతలో రూ.25 వేలు, మూడవ విడతలో రూ.50 వేలు చిరు వ్యాపారులకు రుణాలు అందిస్తామన్నారు. ట్రాఫిక్ సీఐ మన్సూరుద్దీన్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ప్రజారోగ్య అధికారి విశ్వేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

19న ఎల్‌ఆర్‌ఎస్ మేళా

కర్నూలు (టౌన్): అనధికార లేఔట్ల క్రమబద్ధీకరణపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఈనెల 19వ తేదీన ఎల్‌ఆర్‌ఎస్ మేళా నిర్వహించనున్నట్లు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు, దరఖాస్తుదారులు పాల్గొని తమ సందేహాలను నివృత్తి చేసుకోవచ్చని పేర్కొన్నారు. అలాగే నగరంలోని దామోదరం సంజీవయ్య సర్కిల్, వై.జంక్షన్, గుత్తి పెట్రోల్ బంకు ప్రాంతాల్లో మేళాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఈ మేళాలో పౌరులు అవసరమైన పత్రాలు, దరఖాస్తు విధానం, రుసుం, క్రమబద్ధీకరణకు సంబంధించిన వివరాలు తెలుసుకోవచ్చని వెల్లడించారు.

దొంగ ఓట్లకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ

కర్నూలు(సెంట్రల్): దొంగ ఓట్లకు వ్యతిరేకంగా సిటీ కాంగ్రెస్ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని కాంగ్రెస్ నాయకులు చేపట్టారు. బుధవారం నగరంలోని గడియారం ఆసుపత్రి, పాత బస్టాండ్‌లో ప్రజల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నగర కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ జిలానీ బాషా మాట్లాడుతూ.. కేంద్రంలోని బీజేపీ ఎన్నికల సంఘాన్ని గుప్పిట్లో పెట్టుకొని ఓట్ల చోరీకి పాల్పడుతోందన్నారు. దేశంలోని అన్ని వ్యవస్థలు ప్రధాని నరేంద్రమోదీ గుప్పిట్లో ఉన్నాయని, ప్రతిపక్షాలు ఏమైనా మాట్లాడితే ఈడీ, సీబీఐలు రంగంలోకి దిగుతాయన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి దేశ ప్రజలు మద్దతు పలకాలని కోరారు. నాయకులు రాధాకృష్ణ, సయ్యద్ ఖాద్రిపాషా, బతుకన్న, బజారన్న, డీవీ సాంబశివుడు, ఏ.సూర్యప్రకాష్‌రెడ్డి, రేపల్లె ప్రతాప్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉద్యోగులపై వేధింపులు ఆపాలి


మాట్లాడుతున్న ఆర్.నరసింహులు

కర్నూలు(సెంట్రల్): మునిసిపల్, సచివాలయ ఉద్యోగులపై కమిషనర్ వేధింపులు ఆపాలని సీఐటీయూ న్యూసిటీ నగర అధ్యక్ష, కార్యదర్శులు వై.నగేష్, ఆర్.నరసింహులు కోరారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. కర్నూలు నగరం విస్తరిస్తుండటంతో జనాభా విపరీతంగా పెరిగిపోతోందన్నారు. అయితే ప్రభుత్వం మాత్రం ఉన్న సిబ్బందితోనే పనిచేయిస్తోందని, ఫలితంగా ఉద్యోగులపై తీవ్ర పనిభారం పడుతుందన్నారు. పనిభారంతో ఉద్యోగులు సతమతం అవుతున్న తరుణంలో కమిషనర్ వారిపై సానుభూతి చూపాల్సింది పోయి వేధించడం తగదన్నారు. రాజకీయ నాయకులు చెప్పిన పని కోసం ఉద్యోగులను వేధించడం అన్యాయమన్నారు. ముఖ్యంగా శానిటేషన్ విభాగానికి తీవ్ర పనిభారం ఉంటోందని వాపోయారు.

శామ్యూల్ జార్జ్‌కు నివాళి


జార్జ్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆదిమూలపు సతీష్, తదితరులు

కర్నూలు సిటీ: ఏక్యాంపులోని మథర్ థెరిస్సా ఫార్మసీ కాలేజీలో జార్జ్ విద్యా సంస్థల వ్యవస్థాపకులు డాక్టర్ శామ్యూల్ జార్జ్ 19వ వర్ధంతి కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఆ కాలేజీ డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ స్టెల్లా సతీష్ పాల్గొని జార్జ్ విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కర్నూలు, ప్రకాశం జిల్లాల్లో విద్యాభివృద్ధికి జార్జ్, థెరిసమ్మ ఎంతో కృషి చేశారన్నారు. వారి ఆశయ సాధన కోసం జార్జ్ విద్యా సంస్థల్లో విలువలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.రాజ్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ కె.సురేష్, బీఈడీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మోదీ జన్మదిన వేడుకలు


రక్తదాన శిబిరంలో బీజేపీ నాయకులు

కర్నూలు కల్చరల్: విశ్వకర్మ జయంతి, దేశ ప్రధాని నరేంద్ర మోదీ జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. రక్తదాన శిబిరాలు, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి, అనాథాశ్రమాల్లో పండ్లు, బ్రెడ్లను పంపిణీ చేశారు. బీజేపీ రాష్ట్ర నాయకులు, ఎడ్యుకేషన్ ఐటీ కార్పొరేషన్ డైరెక్టర్ నగరూరు రాఘవేంద్ర ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ జయశ్రీ శాంతి, నాయకులు అనితా రెడ్డి, మనోహరి, సీతక్క, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు పక్కన ఉల్లి పారబోత


గార్గేయపురం సమీపంలో రోడ్డు పక్కన పడేసిన ఉల్లి బస్తాలు

కర్నూలు(రూరల్): జిల్లాలో ఉల్లి రైతుల పరిస్థితి దయనీయంగా మారింది. ప్రభుత్వ నిర్లక్ష్యం, అధికారుల అసమర్థత కారణంగా కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డులో ఉల్లి నిల్వలు పేరుకుపోయాయి. కొనేవారు లేకపోవడంతో రోజూ వందలాది క్వింటాళ్ల ఉల్లి కుళ్లిపోతుంది. యార్డులో ఉల్లి నిల్వలు పేరుకుపోవడంతో వందల క్వింటాళ్ల ఉల్లిని అధికారులు, మార్క్‌ఫెడ్ వారు గార్గేయపురం డంప్ యార్డులో పడేస్తున్నారు. రోజురోజుకు యార్డులో ఉల్లి నిల్వలు పెరుగుతున్నాయే తప్పా తగ్గడం లేదు. దీంతో మార్క్‌ఫెడ్ కొనుగోలు చేసిన ఉల్లి బస్తాలు, యార్డులోని ఉల్లి నిల్వలను ఏంచేయాలో అధికారులకు దిక్కుతోచడం లేదు. ఈ స్థితిలో బుధవారం మధ్యాహ్నం టిప్పర్ లారీలో ఉల్లి బస్తాలను తీసుకొచ్చి గార్గేయపురం దర్గా సమీపాన నగర పాలక సంస్థ డంప్ యార్డుకు వెళ్లే దారిలో రోడ్డు పక్కన పడేశారు. దాదాపు 200 ఉల్లి బస్తాలను పడేసినట్లు తెలుస్తోంది. ఉల్లికి గిట్టుబాటు ధర లేక ఇక్కడ తెచ్చి పడేశారా? లేక నగరంలోని మార్కెట్ యార్డు అధికారులు ఉల్లి దిగుబడులను తెచ్చి పడేశారా? అని గ్రామస్తులు చర్చించుకుంటున్నారు. పడేసిన ఉల్లి బస్తాలను గార్గేయపురం, సమీప గ్రామాల ప్రజలు ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో, భుజాన వేసుకొని కొందరు ఎత్తుకెళ్లిపోయారు.

నేడు ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్ రాక

కర్నూలు (అగ్రికల్చర్): ఏపీఎస్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కె.సంతోష్‌రావు గురువారం కర్నూలుకు రానున్నారు. మధ్యాహ్నం 2:30 గంటలకు కేవీ సుబ్బారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో జరిగే కార్యక్రమంలో పాల్గొంటారు. నిరంతర విద్యుత్ సరఫరా, విద్యుత్ సరఫరాలో ఉన్న ఇబ్బందులు, వినియోగదారులకు విద్యుత్ సిబ్బంది అందుబాటులో ఉండటం అనే అంశాలపై ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకుంటారు.

సంపూర్ణ భగవద్గీత పారాయణం


భగవద్గీత పారాయణం చేస్తున్న భక్తులు

కర్నూలు కల్చరల్: గీతా ప్రచార సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఇందిరా ఏకాదశి పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో సంపూర్ణ భగవద్గీత పారాయణం చేశారు. సంకల్‌బాగ్‌లోని గీతా ప్రచార ధామంలో జరిగిన కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ధార్మిక ప్రవచకులు ఢమాం జగదీష్ సందేశమిచ్చారు. మోక్ష సాధనకు జ్ఞాన సముపార్జన కన్న మించిన మార్గం లేదని, ఆ మార్గాన్ని చూపుటకు భగవంతుడి అంశ కలిగిన సద్గురువులలో విద్యా ప్రకాశానంద స్వామి ఒకరన్నారు. గీతా ప్రచార ధామం వ్యవస్థాపక అధ్యక్షుడు గీతారత్న డీవీ రమణ, కార్యదర్శి ఇల్లూరి వెంకటరమణ, సభ్యులు సింహాద్రి రమేష్, జగన్, మహాబలేష్, విష్ణు సహస్ర నామ సంఘం అధ్యక్షుడు మల్లెల పుల్లారెడ్డి, తిరుమల తిరుపతి దేవస్థానములు హిందూ ధర్మ ప్రచార పరిషత్తు ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

కర్నూలు(సెంట్రల్): ప్రధానమంత్రి నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకొని బీజేపీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. స్థానిక ధర్నా చౌక్‌లో ఏర్పాటు చేసిన శిబిరాన్ని రాజ్యసభ మాజీ ఎంపీ టీజీ వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. రక్తదాతలను అభినందించారు. కార్యక్రమంలో.. డాక్టర్ కొట్టే చెన్నయ్య జాతీయ స్థాయిలో పద్మ అవార్డులు అందుకున్న వారి చరిత్రను తెలియజేస్తూ రచించిన 'పద్మ కుసుమాలు' పుస్తకాన్ని టీజీ వెంకటేష్ ఆవిష్కరించారు. బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు సునీల్‌రెడ్డి, నాయకులు రామస్వామి, మాధవీలత పాల్గొన్నారు.

మహిళ ఆరోగ్యమే కుటుంబానికి బలం


మాట్లాడుతున్న సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు

కర్నూలు(హాస్పిటల్): మహిళ ఆరోగ్యంగా ఉంటే ఆ కుటుంబం అంతా సంతోషంగా ఉంటుందని, కుటుంబం సంతోషంగా ఉంటే సమాజం శక్తివంతమవుతుందని, అందుకే మహిళల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు సూచించారు. బుధవారం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గైనకాలజీ విభాగంలో 'స్వస్థ నారీ–శశక్తి పరివార్ అభియాన్' అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఈ ప్రత్యేక కార్యక్రమం అక్టోబర్ 2వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. మహిళల ఆరోగ్య సంరక్షణను మరింత బలోపేతం చేయడం, కుటుంబ సుభిక్షానికి పునాది వేయడం కార్యక్రమ లక్ష్యమని వివరించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల మహిళలు అందుబాటులో ఉన్న వైద్య సేవలను వినియోగించుకోవాలని సూచించారు. వైద్య సిబ్బంది రక్తహీనత సమస్యలపై పరీక్షలు, సలహాలు, గర్భధారణ జాగ్రత్తలు, తల్లీ బిడ్డ ఆరోగ్యానికి వైద్య సూచనలు, ప్రసూతి అనంతరం సంరక్షణ, స్త్రీ రోగాలపై అవగాహన కల్పిస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కర్నూలు మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా మహిళల ఆరోగ్యం కాపాడితే సమాజం మొత్తానికి శక్తివంతమైన పునాది వేస్తుందన్న నమ్మకం ఉందన్నారు. మహిళలు ఆరోగ్యంపై జాగ్రత్తలు పాటిస్తే కుటుంబంలో వైద్య సమస్యలు తగ్గుతాయని, ఆర్థిక భారాన్ని కూడా తగ్గించుకోవచ్చని తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హరిచరణ్ జనరల్ సర్జరీ విభాగం వైద్యులు డాక్టర్ మాధవీశ్యామల, పెథాలజీ హెచ్‌ఓడీ డాక్టర్ బాలేశ్వరి, గైనిక్ హెచ్‌ఓడీ డాక్టర్ సావిత్రి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ మోసంపై ఉద్యమించాలి


మాట్లాడుతున్న పి.నిర్మల

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల సమయంలో.. రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన మహిళలందరికీ నెలకు రూ.1500 చొప్పున ఇస్తామని చెప్పి మోసం చేసిన కూటమి ప్రభుత్వంపై ఉద్యమించాలని ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు పి.నిర్మల పిలుపునిచ్చారు. బుధవారం కార్మిక, కర్షక భవన్‌లో ఐద్వా న్యూసిటీ కమిటీ మూడో మహాసభలు జరిగాయి. ఈ సందర్భంగా ఆమె అరుణ పతాకాన్ని ఆవిష్కరించారు. నేతలు కిరణ్మయి, శ్యామల అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆమె, జిల్లా కార్యదర్శి అలివేలుతో కలిసి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళలపై జరుగుతున్న దాడులు, దోపిడీలు, హత్యలు, అత్యాచారాలను నిరోధించడంలో పూర్తిగా విఫలమయ్యాయన్నారు. చట్టాలను పకడ్బందీగా అమలు చేస్తే మహిళలపై దాడులకు అవకాశం ఉండదన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకోగా కార్యదర్శిగా ఎస్.శ్యామలమ్మ, అధ్యక్షురాలిగా ఎం.కుమారి, గౌరవాధ్యక్షులుగా రత్నమ్మను ఎన్నుకున్నారు.

క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలి


విజేతలకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న జిల్లా ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు రామాంజనేయులు

కర్నూలు (టౌన్): చదువుతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు రామాంజనేయులు అన్నారు. బుధవారం స్థానిక శ్రీనగర్ కాలనీలోని చైతన్య స్కూల్ క్రీడా దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల్లో స్పోర్ట్స్ కోటా కింద కేంద్ర ప్రభుత్వం 3 శాతం రిజర్వేషన్లు కేటాయించిందన్నారు. చిన్నతనం నుండే క్రీడల్లో సాధన చేసి స్పోర్ట్స్ కోటా రిజర్వేషన్లు వినియోగించుకోవాలన్నారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల ఒత్తిడిని అధిగమించి మానసికంగా ఉల్లాసంగా ఉంటారన్నారు. క్రీడాదినోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన రన్నింగ్ రేస్, షాట్‌పుట్, స్కిప్పింగ్, లెమన్ అండ్ స్పూన్ తదితర క్రీడల్లో విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు ప్రతిభా సర్టిఫికెట్లు అందజేశారు. ప్రిన్సిపాల్ సుహాసిని, ప్రాంతీయ పర్యవేక్షకులు రామాంజనేయులు, కోఆర్డినేటర్ నాగేశ్వరరావు, పీఈటీ డేవిడ్ పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను మళ్లించరాదు



ధర్నా చేస్తున్న డీహెచ్‌పీఎస్ నాయకులు

కర్నూలు(సెంట్రల్): ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను దారి మళ్లించి దళితులు, గిరిజనులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని డీహెచ్‌పీఎస్ జిల్లా కార్యదర్శి మహేష్, సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.మునెప్ప ధ్వజమెత్తారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట డీహెచ్‌పీఎస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో దళిత, గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. స్వయం ఉపాధి కోసం నిధులు ఇస్తామని చెప్పిన చంద్రబాబునాయుడు మోసం చేస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలోని నరేంద్రమోదీ ప్రభు త్వం ఎస్‌ఎస్‌ఎఫ్‌డీసీ నిధులను నాలుగేళ్లుగా విడుదల చేయకుండా అన్యాయం చేస్తోందన్నారు. కొనే రు రంగారావు కమిటీ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళిత, గిరిజనుల అభివృద్ధిపై చిత్తశుద్ధితో పనిచేయకపోతే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు రామచంద్ర, నాయకులు పాల్గొన్నారు.

నేడు సీఎఫ్ బాధ్యతల స్వీకరణ

కర్నూలు కల్చరల్: కర్నూలు సర్కిల్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ (సీఎఫ్)గా ఐఎఫ్ఎస్ బీవీఏ కృష్ణమూర్తి గురువారం ఉదయం బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇటీవల జరిగిన ఐఎఫ్ఎస్ బదిలీల్లో భాగంగా శ్రీశైలం ప్రాజెక్ట్ టైగర్ సర్కిల్ ఫీల్డ్ డైరెక్టర్‌గా ఉన్న ఈయన్ను కర్నూలుకు బదిలీ చేశారు. ఇక్కడ ఇన్‌చార్జ్ సీఎఫ్‌గా ఉన్న యశోదాబాయి బుధవారం రిలీవ్ అయ్యారు.

డీఎస్సీ అభ్యర్థుల తరలింపునకు 134 బస్సులు

కర్నూలు (సిటీ): డీఎస్సీలో భాగంగా ఉపాధ్యాయ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 19న అమ రావతిలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా నియా మక పత్రాలు అందించనున్నారు. ఉమ్మడి జిల్లాలో పోస్టులకు ఎంపికైన 2,805 మంది అభ్యర్థులను అమరావతికి తరలించేందుకు 134 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేశారు. గురువారం ఉదయం 8 గంటలకు రాయలసీమ యూనివర్సిటీ నుంచి బస్సులు బయలుదేరనున్నాయి. వీటిని జేసీ బి.నవ్య జెండా ఊపి ప్రారంభించనున్నారు. అభ్యర్థితో పాటు ఒక సహాయకుడు, ప్రత్యేక అధికారులు కలిసి మొత్తం 6,194 మంది బస్సుల్లో వెళ్లనున్నట్లు డీఈఓ శామ్యూల్ పాల్ తెలిపారు.

సమస్త లోక సృష్టికర్త విశ్వకర్మ


విశ్వకర్మ భగవాన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డీఆర్వో వెంకట నారాయణమ్మ


నివాళులర్పిస్తున్న విశ్వ బ్రాహ్మణులు

కర్నూలు(సెంట్రల్): సమస్త విశ్వం సృష్టికర్త విరాట్ విశ్వకర్మ భగవాన్ అని, ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఆర్వో సి.వెంకటనారాయణమ్మ పిలుపునిచ్చారు. బుధవారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో విరాట్ విశ్వకర్మ భగవాన్ జయంతి కార్యక్రమాన్ని అధికారికంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఆర్వో హాజరై విశ్వకర్మ భగవాన్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వెనకబడిన వర్గానికి చెందిన విరాట్ విశ్వకర్మ భగవాన్ తన ఆలోచనలతో విశ్వాన్ని సృష్టించిన రూపకర్తగా మారరన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా ఆర్థికంగా, రాజకీయంగా, విద్య పరంగా వెనుకబడిన కులాలు అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు. విరాట్ విశ్వకర్మ భగవాన్ నైపుణ్యానికి, జ్ఞానానికి ప్రతీక అన్నారు. సృష్టి నిర్మాణంలో ఆయన పాత్ర కీలకమన్నారు. సమాజానికి అవసరమయ్యే వస్తువులను చేతి వృత్తుల ద్వారా ఎలా తయారు చేసుకోవాలో చూపించారన్నారు. బీసీ సంక్షేమ సాధికారత అధికారిణి కె.ప్రసూన, బీసీ కార్పొరేషన్ ఈడీ జాకీర్ హుస్సేన్, సహాయ బీసీ సంక్షేమాధికారి శ్రీనివాసులు, వసతి గృహ సంక్షేమాధికారులు శారదమ్మ, వెంకట ప్రమీళ, కనక లత తదితరులు

కర్నూలు(సెంట్రల్): సమస్త లోకానికి సృష్టికర్త మద్విరాట్ విశ్వకర్మ అని స్వర్ణకార విశ్వ బ్రాహ్మణ కర్నూలు నగర అధ్యక్షుడు కె.సోమయ్య ఆచారి పేర్కొన్నారు. బుధవారం షరాఫ్ బజార్‌లో శ్రీశ్రీ మద్విరాజ విశ్వకర్మ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విశ్వకర్మ జగత్తుకు చరాచర ప్రకృతి కర్త అని, సాక్షాత్తు దేవతలు విశ్వకర్మ త్రిమూర్తులు, పంచమూర్తుల స్వరూపాలేనని కొనియాడారు. సెక్రటరీ సురేష్, కోశాధికారి రాఘవేంద్ర ఆచారి పాల్గొన్నారు.

బాబోయ్ కుక్కలు!

- పెరుగుతున్న వీధి కుక్కల బెడద
- భయాందోళన చెందుతున్న ప్రజానీకం


గార్గేయపురం బస్టాండ్ వద్ద సంచరిస్తున్న వీధి కుక్కలు

కర్నూలు(రూరల్): ఎక్కడ చూసినా కుక్కలు భౌ.. భౌ.. అంటూ మొరుగుతూ జనాన్ని హడలెత్తిస్తున్నాయి. ఏ వీధికెళ్లినా కుక్కలు గుంపులు గుంపులుగా తిరుగుతూ భయాందోళన కలిగిస్తున్నాయి. కర్నూలు మండలంలోని గ్రామాల్లో వీధి కుక్కల బెడదతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. గ్రామాల్లో వీధికుక్కలు స్వైర విహారం చేస్తూన్నాయి. వీటిని నియంత్రించాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్లు చోద్యం చూస్తున్నారు. రోజూ ఏదోక చోట, ఎవరో ఒకరు కుక్క కాట్లకు గురువుతున్న సంఘటనలు జరుగుతూనే ఉన్నాయి.

గ్రామాల్లో వీధి కుక్కలు గుంపులుగా తిరుగుతూ కనిపించిన వారికి దాడికి దిగుతున్నాయి. విచక్షణ రహితంగా కరిచి గాయపరుస్తున్నాయి. ప్రధానంగా మాంసం, చేపలు, హోటళ్లు, దుకాణాల వద్ద, జనావాసాలు ఉన్న వీధుల్లో తిష్ట వేసి ఉంటున్నాయి. అటుగా రాకపోకలు సాగించే వారిపై ఒక్కసారిగా దాడి చేస్తున్నాయి. పల్లెల్లో కుక్కలు లేని వీధి లేదంటే ఆశ్చర్యం కలగకమానదు. దీంతో చీకటి పడితే చాలు బయటకు రావడానికి జనం జంకుతున్నారు. చిన్న పిల్లలను సాయంత్రం వేళ బయటకు పంపడం మానేశారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుక్కకాటు వివరాలు

మండల పరిధిలో 23 గ్రామ పంచాయతీలకు గాను గార్గేయపురం, ఇ.తాండ్రపాడులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. గత జూన్ నుంచి సెప్టెంబర్ 15వ తేదీ వరకు గార్గేయపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 62 కుక్క కాటు కేసులు, ఇ.తాండ్రపాడు కేంద్రంలో 78 కుక్క కాటు కేసులు నమోదైనట్లు వైద్యాధికారులు తెలిపారు. ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే వారిని కలుపుకుంటే ఈ సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. నగర శివారులోని గ్రామాల వారు కుక్క కాటుకు గురైతే కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు పరుగులు పెడుతున్నారు.

మండల పరిధిలోని బి.తాండ్రపాడు కురువగేరిలో వీధి కుక్కల బెడద ఎక్కువైందని, పలువురిపై దాడి చేసి కరిచాయని గ్రామస్తులు వాపోతున్నారు.

- ఆర్.కొంతలపాడులో మారెమ్మ గుడి, బస్టాండ్, చికెన్ షాపుల వద్ద, చర్చి వీధిలో వీధి కుక్కలు ద్విచక్ర వాహనదారులను వెంబడించి దాడి చేస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు.
- గార్గేయపురంలో తెలుగుగేరి, మాలపేట, మరాఠి గేరి, కోట వీధి, బీసీ కాలనీలో కుక్కలు పలువురిని గాయపరిచాయి.
- శివరామపురం వాటర్‌ట్యాంక్ ప్రాంతంలో కుక్కలు తిష్ట వేసి రాత్రి సమయాల్లో వెళ్లే వారిపై దాడి చేస్తున్నాయి.

పంచాయతీలదే బాధ్యత

పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం గ్రామాల్లో ప్రజలకు వీధి కుక్కల నుంచి రక్షణ కల్పించాల్సిన బాధ్యత పంచాయతీలపై ఉంది. వీధి కుక్కలను పట్టుకొని పశు వైద్యాధికారితో యాంటీ రేబిస్ వ్యాక్సిన్ (ఏఆర్‌వీ)వేయించాలి. కుక్కల సంతతి పెరగకుండా వాటికి సంతాన నియంత్రణ శస్త్రచికిత్సలు చేయించాలి. పెంపుడు కుక్కల యజమానులు పంచాయతీలో లైసెన్సు తీసుకొని, పన్ను కూడా చెల్లించాలి. కానీ పంచాయతీ పాలకులు మాత్రం కుక్కల సమస్య తమది కాదంటూ చేతులు దులిపేసుకుంటున్నారు. దీంతో గ్రామాల్లో రోజురోజుకూ వీధి కుక్కల సమస్య పెరుగుతుంది.

కుక్క కాటుతో ఇబ్బంది పడ్డాను



మా గ్రామంలో పీర్ల చావిడి కాలనీలో వీధికుక్కలు ఎక్కువగా ఉన్నాయి. గత నెలలో నన్ను కుక్క కరిచింది. కుక్క కాటుతో చాలా ఇబ్బందులు పడ్డాను. ఆరె గేరిలో వీధి కుక్కలు ఎక్కువగా ఉండటం వల్ల పనుల నిమిత్తం ఆ కాలనీకి వెళ్లాలంటే కుక్కలు దాడిచేస్తాయేమోనని భయంభయంగా ఉంటోంది. గతంలో ఈ కాలనీలో ఎంతోమంది కుక్కకాటుకు గురయ్యారు.ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి కుక్కల సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

– మున్వర్, పెయింటర్, గార్గేయపురం గ్రామం



అంతా బురదమయం

రోడ్డుపై నిలిచిన నీరు

ఈ చిత్రంలో కనిపిస్తున్న దృశ్యం కల్లూరు అర్బన్ శాంతినగర్, టెలికాంనగర్ పరిధిలోనిది. రోడ్డుపై గుంతలు ఉండడం, డ్రైనేజీ కాలువలు లేకపోవడం వల్ల రోడ్డుపై వర్షం నీరు, మురుగు నీరు నిలుస్తోందని కాలనీ వాసులు వాపోతున్నారు. ద్విచక్ర వాహనదారులు, ఇతర ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై వర్షపు నీరు, మురుగునీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. – కల్లూరు

మహిళా హక్కుల కోసం పోరాడిన నేత 'పెరియార్'


పెరియార్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న మహిళా నేతలు

కర్నూలు(అర్బన్): మహిళల స్వేచ్ఛ, హక్కుల కోసం నిరంతరం పోరాడిన ఉద్యమకారుడు పెరియార్ రామస్వామి అని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళా ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షురాలు నంది విజయలక్ష్మి అన్నారు. బుధవారం స్థానిక వేదిక కార్యాలయంలో పెరియార్ జయంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి మహిళా నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ.. పెరియార్ రామస్వామి, భార్య నాగమ్మాయి, సోదరి బాలంబల్ సారా ఉద్యమంలో ముందుండి పోరాడారన్నారు. మహిళలను ఉద్యమంలో భాగస్వాములను చేస్తూ పెరియార్ ప్రోత్సహించారన్నారు. వేదిక మహిళలందరూ పెరియార్ ఆలోచనా విధానంతో ముందుకు వెళ్తున్నట్లు చెప్పారు. మహిళా ఐక్యవేదిక మరింత ఉత్సాహంగా ప్రజలతో మమేకమై వారి సమస్యలపై గళం విప్పాలని పిలుపునిచ్చారు. కర్నూలు, నంద్యాల జిల్లాల్లో ఉన్న వేదిక కమిటీలను రద్దు చేయడం జరిగిందన్నారు. త్వరలోనే రెండు జిల్లాల్లో నూతన కమిటీలను ఏర్పాటు చేసి ప్రజా పోరాటాలకు సిద్ధం అవుతామని తెలిపారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మహిళా నేతలు పాల్గొన్నారు.